క్లుప్తంగా

శాంతి ఆశ్రమం నిర్మాణానికి విరాళం



తెనాలిఅర్బన్: బుర్రిపాలెం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న మహాత్మా సేవా శాంతి ఆశ్రమానికి గుర్రం లక్ష్మీ సత్యవతి జ్ఞాపకార్థం ఆమె మేనల్లుడు కృష్ణగుప్త రూ.50,121 విరాళం ఇచ్చారు. దానికి సంబంధించిన చెక్కును గురువారం కొల్లా వారి వీధిలోని ఆశ్రమంలో అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, నేరెళ్ళ వెంకట శివసుబ్రమణ్యం, వై.కోటేశ్వరరావు, కుటుంబ రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

6న యూపీఎఫ్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ




తెనాలి: మణిపూర్‌లో జరిగిన దురాగతాలకు నిరసిస్తూ, అక్కడ శాంతిని ఏర్పరచాలనే డిమాండ్‌తో ఈనెల 6వ తేదీన చుండూరు మండలం వలివేరు గ్రామం నుంచి శాంతిర్యాలీని నిర్వహించనున్నారు. చుండూరుకు చెందిన యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ శాంతి ర్యాలీని జరపనున్నట్టు చైర్మన్ బి.సముయేలు గురువారం తెలియజేశారు. వలివేరు పెట్రోలు బంక్ దగ్గర నుంచి వేటపాలెం మీదుగా చుండూరు మండల తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగే ర్యాలీని అన్నివర్గాల ప్రజలు పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. యూపీఎఫ్ అధ్యక్షుడు ఎం.జాన్‌బాబు, ఉపాధ్యక్షుడు ఇశ్రాయేలు, కార్యదర్శి ఎం.ఉజ్జీవరత్నం, సంయుక్త కార్యదర్శి కె.యబ్బేజు, కోశాధికారి జి.పురుషోత్తం పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



గుంటూరులో చికిత్సపొందుతున్న కాంతమ్మకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ రవికాంత్

తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ తెనాలిలో గురువారం కొనసాగింది. పట్టణంలోని అన్ని వార్డులలో వలంటీర్‌లు, వెల్ఫేర్ సెక్రటరీలు లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేశారు. గంగానమ్మపేటకు చెందిన జంధ్యాల కాంతమ్మ అనారోగ్యంతో గుంటూరులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఉంది. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ సెక్రెటరీ జె.రవికాంత్ అక్కడికి వెళ్లి వృద్ధాప్య పింఛన్‌ను పంపిణీ చేశారు.



ముత్తింశెట్టిపాలెంలో బాజీకి దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షబీదా బేగం

కొవ్వొత్తుల ర్యాలీ

తాడికొండ: మణిపూర్‌లో ఆదివాసీలు, గిరిజనుల నరమేథంపై ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ స్పందించకపోవడం దారుణమని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలకా విజయ్‌కుమార్ అన్నారు. మణిపూర్ ఘటనకు నిరసనగా తాడికొండలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ లియాకత్‌అలీ, ఎ.సూర్యనారాయణ, శ్రీనివాస్, రహంతుల్లా, షేక్ అబ్దుల్ అలీ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మంగళగిరి: నగరంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో ఓ ద్విచక్రవాహనం మాయమైన ఘటనపై పట్టణ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు అందింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గుంటూరు నగరంలోని శారదాకాలనీకి చెందిన కర్నాటి లక్ష్మీనారాయణ తాపీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల జులై 28వ తేదీ ఉదయం తొమ్మిది గంటల సమయంలో తన అన్న కర్నాటి నాగరాజుతో కలసి గుంటూరు నుంచి ద్విచక్రవాహనంపై మంగళగిరికి పని నిమిత్తం వచ్చారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని ఓ హోటల్ లో టిఫిన్ చేసేందుకు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి వెళ్లారు. కొద్దిసేపటి అనంతరం తిరిగి వచ్చి చూడగా పార్కింగ్‌లోని ద్విచక్రవాహనం మాయమైంది. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. వాహనదారుడు బుధవారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్ష విజయవంతం

- నియోజకవర్గంలో 95,945 కుటుంబాలకు 37,291 మందికి సర్టిఫికెట్ల పంపిణీ
- 98 శాతం మందికి కోరిన సర్టిఫికెట్లను అందజేయగలిగాం
- జిల్లాలోనే అగ్రగామిగా తెనాలిని నిలిపాం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్, పక్కన ఖలేదా నసీమ్, శ్రీనివాసరావు, పార్టీ నేతలు

తెనాలి: జగనన్న సురక్ష తెనాలి నియోజకవర్గంలో విజయవంతమైందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ప్రజలకు సంక్షేమాన్ని పారదర్శకతతో అందించటమే కాకుండా, ఎప్పటికప్పుడు వారి అవసరాలను గుర్తిస్తూ, సత్వరం పరిష్కరిస్తున్న ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదొక నిదర్శనమన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను సత్వరం అందించాలనే ఉద్దేశంతో జూన్ 23 నుంచి జులై ఒకటో తేదీవరకు ప్రత్యేకంగా జగనన్న సురక్ష జరిపినట్టు గుర్తుచేశారు. నియోజకవర్గంలో 95,945 గృహాలకుగాను వివిధ రకాల సర్టిఫికెట్లకని 38,057 దరఖాస్తులు రాగా, వీటిలో 37,291 మందికి అంటే 98 శాతం మందికి సర్టిఫికెట్లను అందజేశామని చెప్పారు. పట్టణంలో 9,528 మందికి, రూరల్ మండలంలో 23,751 మందికి, కొల్లిపర మండలంలో 4,012 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశామన్నారు. ఆయా సభల్లో తనతోపాటు ప్రజాప్రతినిధులు స్వయంగా పాల్గొన్నట్టు తెలిపారు.

రాష్ట్రంలోనే ప్రథమస్థానం..

తెనాలి నియోజకవర్గంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. సహకరించిన అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను ఆచరించటం, వారికి లబ్ధిని చేకూర్చటంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి జగనన్న సురక్ష మరో నిదర్శనమని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 65 ఏళ్లు నిండిన వృద్ధులకే పింఛను ఇచ్చినట్టు గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ వయసును 60 ఏళ్లకు తగ్గించి, అర్హులకు పింఛను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తెనాలిలో 36 వేల మంది అవ్వాతాతలకు ప్రతినెల ఒకటో తేదీనే పింఛన్లను అందజేస్తున్నట్టు చెప్పారు. 45–60 ఏళ్ల మహిళలకు చేయూత కింద ఏడాదికి రూ.18,750 ఆర్థికసాయం చేస్తున్నామని చెప్పారు. ఇప్పుడు సురక్ష పేరుతో ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను సింగిల్ డ్రైవ్‌లో పంపిణీ చేయటం మరో అద్భుతమన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా 27 వేలమందికి ఇళ్లస్థలాలను అందించిన ఘనత తనకు దక్కిందని శివకుమార్ చెప్పారు. తొలి దశలో 10 వేల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందన్నారు. అందుకే ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారని, శాశ్వత ముఖ్యమంత్రిగా ఆయన్నే గెలిపించుకోవాలనే భావనతో ఉన్నట్టు వివరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, జగనన్న సురక్ష కన్వీనర్లు ఫరీద్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తాడిబోయిన రామయ్య, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, గొడవర్తి సాయిహరేరామ్, యాతాటి అనిల్, షేక్ ఇస్మాయిల్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు వంపుగళ్ల కృష్ణ, దొడ్డక సాంబశివరావు, తాడిబోయిన రమేష్, కఠారి హరీష్, కాకి దేవసహాయం, షేక్ మీరావలి, కృష్ణారెడ్డి, మేకల రవికుమార్, గఫూర్, కోలా వాసు, బాలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహక నగదు పంపిణీ చేస్తున్న సువీరానంద స్వామీజీ

తెనాలి: చిన్మయా మిషన్, తెనాలి ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.లక్ష ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. పాండురంగపేటలోని కుమార్‌పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం నివాస ప్రాంగణంలో గురువారం ఏర్పాటైన సభలో చిన్మయా మిషన్, గుంటూరు సువీరానంద స్వామీజీ, తెనాలి దేవి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను సువీరానంద స్వామీజీ చేతులమీదుగా అందజేశారు. స్వామి చిన్మయానందజీ వర్ధంతి సందర్భంగా ఈ సేవను చేపట్టినట్టు సభ్యులు తెలియజేశారు. చిన్మయా మిషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా వృద్ధులు, పేదలకు సహాయసహకారాలను అందిస్తున్నట్టు చెప్పారు. ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు గత ఆరేళ్లుగా ఆర్థికతోడ్పాటును ఇస్తున్నామని గుర్తుచేశారు. చిన్మయా మిషన్ స్వామి సేవానంద, దేవి గ్రూప్ సభ్యులు అలపర్తి నాగరత్నమ్మ, కొత్త సుబ్రహ్మణ్యం, కె.రమాదేవి, కె.మాధవీలత, వైవీ కుమారి, ఎస్.లక్ష్మీకుమారి, వి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

జామమొక్కల పంపిణీ



అవగాహన ప్రదర్శనలో డాక్టర్ శారద, డాక్టర్ రామ్‌చంద్

తెనాలి: డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న లక్ష జామ మొక్కల పంపిణీలో భాగంగా గురువారం పట్టణ నాజరుపేటలోని 7,8,9,10 వార్డుల్లో మూడు వేల మొక్కలను పంపిణీ చేశారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద, మానవత సంస్థ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్‌తో కలిసి 10వ వార్డులోని సచివాలయం ఆవరణలో ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీకి చెందిన 200 మంది విద్యార్థులతో ముందుగా సమావేశమయ్యారు. జామ మొక్కతో కలిగే ఉపయోగాలను వారికి అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలోనూ మొక్కను పెంచేలా గృహస్తులకు నచ్చజెప్పాలని సూచించారు. అవగాహన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులచే ఆయా వార్డుల్లోని ప్రతి ఇంటికి జామ మొక్కను పంపిణీ చేశారు. పట్టణంలో నాలుగురోజులుగా మొక్కల పంపిణీని విస్తృతంగా నిర్వహిస్తున్నామని డాక్టర్ శారద చెప్పారు. గురువారం ఒక్కరోజే 7,8,9,10 వార్డుల్లో మూడు వేల మొక్కలను అందజేసినట్టు వివరించారు. ప్రతి ఇంటిలో జామచెట్టు ఉండాలని, ప్రతి కుటుంబం ఆ ఫలాలను తినాలనేది తన ఆకాంక్షగా వివరించారు.

అన్ని జిల్లాల్లో ఎన్‌సీసీ విస్తరణకు సన్నాహాలు

- ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు ప్రభుత్వ హామీ
- ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ మధుసూదనరెడ్డి



ఎన్‌సీసీ అధికారులతో మధుసూదనరెడ్డి

తెనాలి: ఎన్‌సీసీని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ వి.మధుసూదనరెడ్డి చెప్పారు. స్థానిక ఐతానగర్‌లోని ఎన్‌సీసీ 22వ ఆంధ్రా బెటాలియన్‌ను ఆయన సందర్శించారు. నెల రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన ఎయిర్ కమొడోర్ మధుసూదనరెడ్డి ఎన్‌సీసీ కేంద్రాల సందర్శనలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఎన్‌సీసీ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. 2022–23 సంవత్సరంలో ఎన్‌సీసీ బెటాలియన్ కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్‌సీసీ కార్యకలాపాలు ఏవిధంగా జరుగుతున్నాయి...వాటిని మరింత మెరుగ్గా ఎలా చేయాలనే అంశంపై పరిశీలన చేస్తున్నట్టు ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాను ఇంతకుముందే కలిసినట్టు తెలిపారు. ఎన్‌సీసీ శిక్షణ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన స్థలం సమకూర్చేందుకు ముఖ్యమంత్రి హామీనిచ్చినట్టు చెప్పారు. అకాడమీ ఏర్పాటుతో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మరో 60 వేలమంది విద్యార్థులు ఎన్‌సీసీలో ఎన్‌రోల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎన్‌సీసీ అధికారులు ఎ.ఉమాశంకర్, వి.మౌనిక, జి.హనుమంతరావు, సమ్యానాయక్, సర్దార్ పరిశా, కత్తి శ్రీనివాసరావు, కె.స్వామి, బాషా, గోపి, భిక్షాలు పాల్గొన్నారు.

రైతులకు గ్రామ విత్తన పథకంపై శిక్షణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని గుండిమెడ గ్రామంలో గురువారం రైతులకు గ్రామ విత్తన పథకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ అధికారి శ్రీరంజని విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామ విత్తన పథకం ద్వారా తీసుకున్న విత్తనాలను సుడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేసి వెద పెట్టడం ద్వారా మొదటి 30 రోజులు తెగులు ఆశించకుండా ఉంటుందని వివరించారు. విత్తనం మొలక కట్టుకుని ఎకరానికి 12 నుంచి 15 కిలోల వరకు వెద పెట్టాలని సూచించారు. ఏడీఏ హైమావతి మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాన్ని గ్రామంలో రైతులకు అందుబాటులో పెట్టడమే విత్తన పథకం ముఖ్యోద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నీలం వెంకటేశ్వరరావు, నందిపాటి శాంతిశ్రీ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం

కొల్లిపర: వరి వెద పద్ధతి మరియు వరినాట్లకు సిద్ధపడుతున్న తరుణంలో నకిలీ విత్తనాలు, ఎరువులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కె.వెంకటరావు సూచించారు. గురువారం మండలంలో వరి వెద పెట్టిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన అధిక వర్షాలకు వెద పెట్టిన కొన్ని పొలాల్లో మొక్కల సాంద్రత తక్కువ లేదా మొలక సరిగా రాలేదని తెలిపారు. అటువంటి రైతులు వెంటనే తిరిగి మళ్లీ అదే వరి విత్తన రకాన్ని వెద పెట్టుట ద్వారా మొక్కల సాంద్రత సమన్వయ పరిచి సాధారణ దిగుబడులు సాదించ వచ్చు అని తెలిపారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు.

కలుపు రకాన్ని బట్టి మందులు

కొల్లిపర: వెద పద్ధతిలో విత్తన గొర్రు ద్వారా వరి విత్తనం పెట్టిన రైతులు విత్తిన 15 నుంచి 25 రోజులలో వరి పంటలో కలుపు రకాన్ని పరిశీలించి వరి మొక్కకు హాని లేని సెలక్టివ్ పోస్ట్ ఎమర్జెంట్ హర్బిసైడ్స్ మాత్రమే రైతులు వాడాలని ఏఓ కె.వెంకటరావు అన్నారు. గురువారం కొల్లిపర, దావులూరు, తూములూరు గ్రామంలో రైతులు విత్తన గొర్రు ద్వారా వేసిన వరి పంట పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వరి సాగు సాధారణ విస్తీర్ణం 6.312 హెక్టార్ల కాగా ఇప్పటి వరకు 3.100 హెక్టార్లలో నేరుగా రైతులు విత్తన గొర్రు ద్వారా విత్తటం జరిగిందన్నారు. వరి పంటలో ఉన్న కలుపు రకాన్ని బట్టి మందులు పిచికారి చేయాలన్నారు. వరి లో సాధారణంగా గడ్డి జాతి(ఊద, చిప్పెర, గనుపుల గడ్డి, ఉర్రంకి), వెడలుపు ఆకు జాతి(గుంటగలగర, పొనగంటి, అమృతకాడ, పయలాకు), తుంగ జాతి కలుపు మొక్కలు ఉంటాయని, వాటిని రైతులు గమనించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. గడ్డి, తుంగ జాతి మొక్కలు ఎక్కువగా ఉంటే బిస్పైరిబాక్ సోడియం 10శాతం, నామినిగోల్డ్ వారి బిస్పైరి బాక్‌సోడియం ఎకరానికి 100–120 మిలీ వాడాలన్నారు. వెడల్పు ఆకు కలుపునకు మెట్సల్ఫ్యూరాన్ మిథైల్ 10.1 శాతం, ఆలిమ్క్స్ వారి క్లోరిమూరాన్ ఇథైల్ 10.1 శాతం ఎకరానికి 8గ్రాములు చొప్పున పిచికారీరి చేయాలన్నారు. గణుపుల గడ్డి, వుర్రంకి కలుపు ఎక్కువ ఉంటే రైస్ స్టార్ వారి ఫెనోక్సాప్రోప్-పి-ఇథైల్ 6.9శాతం ఎకరానికి 350మి.లీ పిచికారీ చేయాలని సూచించారు. కలుపు మందు పిచికారీ చేసిన తర్వాత తప్పనిసరిగా నీరు పెట్టాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పంటల పరిశీలన



దావులూరిపాలెంలో ప్రకృతి పంటచేలో డాక్టర్ నరసింహారెడ్డి, అధికారులు, రైతులు

దావులూరు(తెనాలి): రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి గురువారం కూడా కొల్లిపర మండలంలో పర్యటించారు. జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండోరోజున దావులూరుపాలెం గ్రామంలో రైతు డి.పృథ్వీరాజ్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో అనుసరిస్తున్న విధానాలు, రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఓబులయ్యకు చెందిన నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ (ఎన్‌పీఎం) దుకాణాన్ని సందర్శించారు. స్కూలు ఆవరణలోని «సూర్యమండలం» (పెరటి తోట)ను చూశారు. గ్రామ సంఘం సమావేశంలో ప్రకృతి వ్యవసాయ మహిళా రైతులు తమ అనుభవాలను తెలియజేశారు. వీరితో గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె.రాజకుమారి, ఏడీపీఎం జానకమ్మ, ఎస్‌డీఏ సుధారాణి, ఎల్1 వసంతకుమారి, పాండురంగారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్నివర్గాలకు మేలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శివకుమార్



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకు మేలు చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గురువారం కొల్లిపర గ్రామంలోని 3వ సచివాలయం పరిధిలో రెండువ రోజు ఆరిమండ కళ్యాణ మండపం వద్ద నుంచి జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే గ్రామంలోని 305 ఇళ్లను సందర్శించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఆ కుటుంబం మూడేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి, సంక్షేమ కరపత్రాలు అందజేశారు. ఈ మూడేళ్లలో ప్రభుత్వం గ్రామంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ కొల్లిపర గ్రామానికి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో సంక్షేమంకోసం రూ.39.55కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఒక్క కొల్లిపర గ్రామపంచాయతీ పరిధిలోని కనీసం ఇంటి స్థలంలేని నిరుపేదలు 351 మందికి ఒక్కొక్కరికి 1.5సెంట్ల స్థలం ఇచ్చినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలకు ఇంకా అర్హత ఉండి, వివిధ సాంకేతిక లోపాల వలన ఇంకా రానివారు తమ దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యను వెంటనే పరిష్కరించనునట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ డ్రైనేజీలో మురుగు నీరు దిగువకు పోవటం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే ఆయన పంచాయతీ కార్యదర్శికి మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. తొలుత గ్రామంలోని వైఎస్సార్, అవుతు రామిరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు కె.శ్రీలత, ఝాన్సీ, నెర్ల కుటుంబరెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, గుదిబండి వెంకటరెడ్డి, గుదిబండి శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ చంద్రమోహన్, తహసీల్దార్ జి.నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఐరన్ పోలిక్ మాత్రలు విద్యార్థులకు గురువారం పంపిణీ చేసినట్లు వైద్యాధికారి ఫరీనా బేగం తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత విద్యార్థులచే మాత్రలు మింగించారన్నారు. పదిగ్రాముల కన్నా తక్కువ రక్తం ఉన్నవారికి రోజుకు రెండుమాత్రలు చొప్పున మింగించాలని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి వారికి రక్తపూత పరీక్షలు చేసి తక్కువగా ఉన్నవారిని గుర్తిస్తున్నట్లు వివరించారు.

బుర్రిపాలెంలో 'బుల్లోడు' కాంస్య విగ్రహం

రేపు సినీప్రముఖులచే ఆవిష్కరణ



సూపర్‌స్టార్ కృష్ణ కాంస్యవిగ్రహం

తెనాలి: సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఆయన సొంతూరు బుర్రిపాలెంలో ఈనెల 5న ఆవిష్కరించనున్నారు. ఆరోజు ఉదయం జరిగే ఆవిష్కరణకు కృష్ణ సోదరుడు, ప్రముఖ సినీనిర్మాత జి.ఆదిశేషగిరిరావు సహా పలువురు సినీరంగ ప్రముఖులు హాజరుకానున్నారు. ఆరోజు విజయవాడ నుంచి తెనాలి సమీపంలోని బుర్రిపాలెం వరకు ర్యాలీని కూడా నిర్వహించనున్నారు. గతేడాది నవంబరు 15న కృష్ణ హైదరాబాద్‌లో కన్నుమూసిన విషయం తెలిసిందే. స్వస్థలమైన బుర్రిపాలెంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు అభిమానులు తలపెట్టారు. వారి సూచన ప్రకారం స్థానిక సూర్యశిల్పశాల శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రులు, 'అగ్నిపర్వతం' సినిమాలోని గెటప్‌తో ఏడు అడుగుల కృష్ణ రూపాన్ని రూపొందించారు. గ్రామసెంటరులో ఈ విగ్రహం ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

■ సినీమారంగంలో సాధించిన విజయాలు, చేసిన ప్రయోగాలు, వెండితెరకు అద్దిన సరికొత్త సొబగులతోనే ఘట్టమనేని శివరామకృష్ణమూర్తి 'సూపర్‌స్టార్' అయ్యారు. ఆయన తల్లిదండ్రులు నాగరత్నమ్మ, వీరరాఘవయ్య చౌదరి. 1943లో మే 5న బుర్రిపాలెంలో జన్మించారు కృష్ణ. ఆయనకు ఇద్దరు సోదరులు జి.హనుమంతరావు, జి.ఆదిశేషగిరిరావు. ఇద్దరు సోదరీమణులు. ఇక్కడి తాలూకా హైస్కూలు, ఏలూరులో కాలేజీ చదువు పూర్తిచేశారు.'తేనె మనసులు' సినిమాతో వెండితెర హీరో అయ్యారు. బాపు 'సాక్షి'తో తో నటుడిగా పదునెక్కారు. సోదరులతో కలిసి పద్మాలయా ప్రొడక్షన్‌తో చిత్రనిర్మాణ రంగంలోకి ప్రవేశించారు. «అగ్నిపరీక్ష», 'మోసగాళ్లకు మోసగాడు' సినిమాలతో విజయాలను అందుకున్నారు. 'గూఢచారి 116' సినిమాతో నవచరితకు నాందిపలికారు. ఇక అప్పట్నుంచి వెనుదిరిగింది లేదు. రోజుకు రెండు, మూడు షిఫ్టులతో ఏడాదికి డజను సినిమాల్లో నటించారు. 1972లో ఏకంగా కృష్ణ సినిమాలు 18 రిలీజయ్యాయి. ప్రయోగాత్మక సినిమాలు, చారిత్రక, జానపద, గూఢచారి, కౌబాయ్...రకరకాల జానర్లలో తీసిన సినిమాలతో 350 సినిమాల్లో నటించిన కృష్ణ, అశేష ప్రజానీకానికి సూపర్‌స్టార్‌గా ఎదిగారు. జ్యోతిచిత్ర సినిమా పత్రిక నిర్వహించిన బ్యాలెట్‌లో వరుసగా అయిదేళ్లు కృష్ణ సూపర్‌స్టార్‌గా ఎన్నికయ్యారు. భారత ప్రభుత్వం ఆయన్ను «పద్మభూషణ్»తో గౌరవించింది. కృష్ణ సతీమణి ఇందిరాదేవి. 1965లో వీరికి వివాహమైంది. భార్య స్వగ్రామం తెనాలి దగ్గర్లోని కంచర్లపాలెం గ్రామం. వీరికి రమేష్‌బాబు, మహేష్‌బాబు, పద్మావతి, ప్రియదర్శిని, మంజుల సంతానం. సహచరి విజయనిర్మలతో కలిసి 40 సినిమాల్లో నటించారు. పద్మాలయా బ్యానర్‌పై 16 సినిమాలు తీశారు. రాజీవ్‌గాంధీ ఆహ్వానంతో కాంగ్రెస్‌లో చేరిన కృష్ణ, 1989లో ఏలూరు ఎంపీగా గెలుపొందారు. 2010 తర్వాత క్రమంగా సినిమాల నుంచి విశ్రాంతి తీసుకున్నారు. చివరిసారిగా 2016లో శ్రీశ్రీ సినిమాలో మరోసారి నటించారు. ఆయన కుమారుడు రమేష్‌బాబు, భార్య ఇందిరాదేవి ఆరునెలల వ్యవధిలో మరణించటంతో కృష్ణ కుంగిపోయారు. అసలే అనారోగ్యానికి తోడు...ఆప్తులను కోల్పోయిన దిగులు...ఆయన్ను మరణానికి చేరువచేసింది.

■ వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నా జన్మస్థలి బుర్రిపాలెంను మరువలేదు సూపర్‌స్టార్ కృష్ణ. అవకాశం ఉన్నపుడల్లా గ్రామానికి వచ్చారు. కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొన్ని సినిమాలనూ చిత్రీకరించారు. ప్రస్తుతం ఆయన తనయుడు, ప్రిన్స్ మహేష్‌బాబు గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఆంధ్రా హాస్పటల్ సహకారంతో గ్రామస్తులకు క్రమంతప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారు. అభివృద్ధి పనులకూ సహకారం అందిస్తున్నారు.

బైకెల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



తెనాలిరూరల్: బైక్‌ల చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు గురువారం వివరాలు వెల్లడించారు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల బైక్ అపహరణకు గురైంది. వాహన యజమాని పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని షేక్ నాయబ్‌రసూల్ అలియాస్ నాయబాగా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అపహరించిన మరో బైక్ విషయం వెలుగు చూసింది. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు రెండు వాహనాలను స్వాధీనపర్చుకున్నారు. నాయబాను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు.

కంప్యూటర్ శిక్షణకు పేర్లు నమోదు చేయించుకోండి

తెనాలిఅర్బన్: రాష్ట్ర ఉర్దూ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అకాడమీ ఇన్‌చార్జి షేక్ అల్తాఫ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీలోపు చెంచుపేటలోని ఉమేష్ చంద్ర బొమ్మ దగ్గరలోని ఉర్దూ అకాడమీ సెంటర్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని చెప్పారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్స్ ఇవ్వటం జరుగుతుందని, అలాగే ఉద్యోగ అవకాశాలు చూపించటం జరుగుతుందని వివరించారు. వివరాలకు 94911 43050 నెంబరులో సంప్రదించాలని సూచించారు.